సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com
EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
సోమవారం
28-04-2025
పేజీలు: 02

## ఐపీఎల్‌లో నేడు




రాజస్తాన్ VS గుజరాత్
జైపూర్,
రాత్రి:7.30

స్టార్ స్పోర్ట్స్,
జియో హాట్
స్టార్‌లో..

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| ఆర్సీబీ | 10 | 7 | 3 | 14 |
| గుజరాత్ | 8 | 6 | 2 | 12 |
| ముంబై | 10 | 6 | 4 | 12 |
| ఢిల్లీ | 9 | 6 | 3 | 12 |
| పంజాబ్ | 8 | 5 | 3 | 10 |
| లక్నో | 10 | 5 | 5 | 10 |
| కోల్‌కత్తా | 8 | 3 | 5 | 6 |
| సన్‌రైజర్స్ | 9 | 3 | 6 | 6 |
| రాజస్తాన్ | 9 | 2 | 7 | 4 |
| చెన్నై | 9 | 2 | 7 | 4 |



ఆరెంజ్ క్యాప్
443
ఐపీఎల్
అత్యధిక రన్స్

పర్పుల్ క్యాప్
18
ఐపీఎల్
అత్యధిక వికెట్స్


# రేవంత్ సర్కారుపై కేసీఆర్ ధ్వజం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎల్కతుర్తిలో జరిగిన పార్టీ రజతోత్సవ సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యంగా, పేదల ఇళ్లను కూల్చివేస్తున్న 'హైడ్రా' ఏర్పాటును ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కూల్చివేతలపై మౌనంగా ఉండకుండా పోరాడాలని ఆయన ప్రజలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. "ప్రభుత్వ స్థలాల్లో పేదలు తెలియక గుడిసెలు వేసుకుంటే, 'హైడ్రా' పేరుతో బుల్డోజర్లతో కూల్చేస్తున్నారు. గతంలో మేము చెరువుల పునరుద్ధరణకు వాడిన బుల్డోజర్లు, నేడు పేదల నివాసాలను నేలమట్టం చేస్తున్నాయి. ఇది చూస్తూ ఊరుకోవద్దు, పోరాడాలి," అని కేసీఆర్ అన్నారు. తమ ప్రభుత్వం గతంలో లక్షలాది మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చిందని గుర్తుచేశారు.కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో వెనక్కి పోయిందని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. "దేశంలో అగ్రస్థానంలో నిలిపిన రాష్ట్రాన్ని కిందికి తీసుకెళ్లారు. ఏడాది చూశాం, ఇక మిగిలింది రెండున్నరేళ్లే. ప్రజలు ఆవేశంతో కాకుండా ఆలోచనతో, వ్యూహాత్మకంగా పనిచేయాలి. ముల్లును ముల్లుతోనే తీయాలి," అని సూచించారు. ప్రభుత్వ అసమర్థత వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందని, భూముల ధరలు పడిపోయాయని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో దాదాపు పూర్తయిన గౌరెల్లి, పాలమూరు ప్రాజెక్టుల పనులను ప్రస్తుత ప్రభుత్వం ఎందుకు పూర్తి చేయడం లేదని ప్రశ్నించారు.పేదల కోసం తాము ప్రవేశపెట్టిన కేసీఆర్ కిట్, అమ్మ ఒడి వంటి పథకాలను నిలిపివేయడాన్ని కేసీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. "కేసీఆర్ కిట్ పేదల కోసం, అమ్మ ఒడి గర్భిణుల సౌకర్యం కోసం. వీటిని బంద్ చేస్తారా కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలనే దురుద్దేశం కనిపిస్తోంది," అని ధ్వజమెత్తారు. గతంలో తాము వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీని కొనసాగించామని గుర్తు చేస్తూ, ప్రస్తుత ప్రభుత్వ వైఖరిని విమర్శించారు. ఈ ప్రభుత్వ తీరుపై పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.ఇక, ఛత్తీస్ గఢ్, తెలంగాణ సరిహద్దులో కేంద్ర బలగాలు చేపట్టిన ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలని కేసీఆర్ డిమాండ్ చేశారు. చేతిలో సైన్యం ఉందని చెప్పి యువతను, గిరిజనులను ఊచకోత కోయడం సరికాదని అన్నారు. మావోయిస్టులతో ప్రభుత్వం చర్చలు జరపాలని స్పష్టం చేశారు.




## క్రికెటర్ల కోసం బీసీసీఐ కీలక నిర్ణయం!

**ఆటగాళ్ల భద్రత కోసం సరికొత్త డ్రోన్**




పెహెల్గామ్ దాడి తర్వాత దేశవ్యాప్తంగా భద్రత విషయంలో చాలా ప్రమతమవుతున్నారు. ఇదే తరుణంలో బీసీసీఐ కూడా ప్లేయర్స్ భద్రత కోసం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి ఐపీఎల్ ఆటలో వజ్ర సూపర్ షాట్ అనే సరికొత్త ఆస్త్రాన్ని ఉపయోగిస్తోంది. వజ్ర సూపర్ షాట్ అనేది ప్రత్యేకమైన యాంటీ డ్రోన్ పరికరం. డ్రోన్ దాడులను సమర్ధంగా అడ్డుకునే ఈ అస్త్రాన్ని భారత్‌కే చెందిన బిగ్ బాంగ్ బూమ్ సొల్యూషన్స్ అనే ప్రైవేట్ కంపెనీ తయారు చేసింది. ఈ డివైజ్‌ను సులువుగా వెంట తీసుకెళ్లవచ్చు. దీని సాయంతో మైదానంలో డ్రోన్ దాడులను నివారించడం సాధ్యమేనంటున్నారు నిపుణులు. ఈ పరికరం నాలుగు కిలోమీటర్ల ఎత్తులో ఉన్న శత్రు డ్రోన్‌లను పసిగట్టగలదు.



## యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం


నల్లగొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. పవర్ ప్లాంట్ మొదటి యూనిట్‌లో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. సోమవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో మొదటి యూనిట్‌లోని బాయిలర్ నుంచి ఆయిల్ లీక్ అయింది. అదే సమయంలో కింద వెల్డింగ్ చేస్తుండగా మంటలు అంటుకున్నాయి. క్రమంగా అవి యూనిట్ మొత్తానికి వ్యాపించడంతో పెద్ద ఎత్తున అగ్ని కీలలు ఎగసిపడుతున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ నేపథ్యంలో 600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి నిలిచిపోయింది. ట్రయల్ రన్‌కు సిద్ధమవుతుండగా ప్రమాదం చోటుచేసుకోవడం గమనార్హం.

## పాకిస్థాన్‌కు అసదుద్దీన్ ఒవైసీ వార్నింగ్



పహల్గామ్ ఉగ్రదాడి విషయంలో పాకిస్థాన్‌పై మరోసారి ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (AIMIM) అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆదివారం మహారాష్ట్రలోని పర్బణిలో వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఓవైసీ మాట్లాడుతూ, పాకిస్థాన్ భారత్ కంటే అర్ధశతాబ్దం వెనుకబడిపోయిందని ఎద్దేవా చేశారు. 'మీ దేశం మిలిటరీ బడ్జెట్ కూడా మా బడ్జెట్‌లో సగం లేదు' అని ఆయన అన్నారు. 'పాకిస్థాన్ తమ వద్ద అణు బాంబులు ఉన్నాయని పదే పదే చెబుతోంది. ఒక్కటి గుర్తుంచుకోండి.. మీరు మరొక దేశంలోకి వెళ్లి నిరపరాధులను చంపితే, ఏ దేశం కూడా మౌనంగా ఉండదు' అని హెచ్చరించారు.

## డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం శుభవార్త



డ్వాక్రా మహిళలకు కూటమి ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. డ్వాక్రా మహిళలకు పెద్దఎత్తున రుణాలు ఇవ్వడంతో పాటు వాటి ద్వారా వారు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వచ్చే ఏడాది మార్చి లోపు 89 లక్షల మంది డ్వాక్రా మహిళలకు రూ.61,964 కోట్ల రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అలాగే వారు కోరుకున్న రంగాల్లో శిక్షణ అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అగ్రికల్చర్, ఫిషరీస్, హార్టికల్చర్, పశుసంపద, సెరికల్చర్ తదితర రంగాల్లో రుణాలు ఇవ్వనుంది. డ్రోన్ల వినియోగం, మినీ రైస్ మిల్స్, తృణధాన్యాల సాగు, దాని ఆధారిత పరిశ్రమలు, సేంద్రియ వ్యవసాయంపై మహిళలను ప్రోత్సహించనుంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా సంఘాల నుంచి 1.25 లక్షల మంది విద్యావంతులైన సభ్యులను ఎన్యుమరేటర్లుగా ఎంపిక చేసి లోన్ ప్లాన్ రూపొందిస్తున్నారు. వీరికి ఆర్థిక వ్యవహారాలు, డిజిటల్ లిటరసీపై స్పెషల్ ట్రైనింగ్ అందించనున్నారు.

## అధిక వడ్డీ ఆశ చూపి రూ.270 కోట్లకు పైగా స్వాహా చేసిన వ్యాపారి

అధిక వడ్డీ ఆశ చూపి ఓ సంస్థ ఘరానా మోసం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దేశవ్యాప్తంగా రూ.270 కోట్లకు పైగా డిపాజిట్లు సేకరిస్తే.. కర్నూలు జిల్లా నుంచే రూ.60-70 కోట్లకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో కంపెనీ అకౌంట్ బ్లాక్ చేశారంటూ ఆ సంస్థ చేతులెత్తేసింది. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. డిపాజిట్లు సేకరించి మోసం చేశారంటూ శ్రేయ ఇన్‌ఫ్రా మార్కెటింగ్ ప్రైవేట్‌లిమిటెడ్ కంపెనీపై ఓ వ్యక్తి ఫిర్యాదుతో కర్నూలు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.వివరాల్లోకి వెళ్ళితే.... ఉత్తరప్రదేశ్‌లోని లక్నో కేంద్రంగా 2020లో స్థాపించిన ఈ కంపెనీకి చైర్మన్ హేమంత్‌కుమార్ రాయ్. రియల్ ఎస్టేట్ (స్థిరాస్తి) వ్యాపారం పేరిట.. తమ వద్ద పెట్టుబడులు పెడితే ఏడాది తిరక్కుండానే రెట్టింపు ఇస్తామని మభ్యపెట్టారు. ఈ సంస్థ దేశంలోని పలు ప్రాంతాల్లో అధిక వడ్డీలు ఆశ చూపి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరిస్తున్నట్లు సమాచారం. 2023 నుంచి కర్నూలు నగరంలో ఓ భవనం అద్దెకు తీసుకొని ఏజెంట్ల ద్వారా డిపాజిట్ల సేకరణ చేపట్టారు. జనాన్ని నమ్మించడానికి కొంత భూమి కొనుగోలు చేసినట్లు సమాచారం. మొదట్లో డిపాజిట్‌దారులకు నెలనెలా ఖాతాలో నగదు జమ చేస్తుండడంతో నమ్మకం ఏర్పడింది. 2024 జూన్ నుంచి చెల్లింపులు ఆపేశారు.



## ఎన్నో బాయ్ ఫ్రెండ్ అని అడిగేవారు

శ్రుతి హాసన్ కి గతంలో కొన్ని ప్రేమ కథలు ఉన్నాయి. ఆమె కొందరితో ప్రేమలో పడింది. తాజాగా తన ప్రేమ కథల పై శ్రుతి హాసన్ ఓపెన్ అయింది. తన లవ్‌స్టోరీలు ఇతరులకు సిల్లీగా అనిపించొచ్చని, కానీ తనకు అలా కాదని హీరోయిన్ శ్రుతిహాసన్ చెప్పుకొచ్చింది. ఈ టాపిక్ పై శ్రుతి హాసన్ ఇంకా మాట్లాడుతూ.. నాతో ఎవరైనా క్లోజ్‌గా ఉంటే 'ఆయన ఎన్నో బాయ్‌ఫ్రెండ్' అని నన్ను అడిగేవారు. నిజానికి 'నేను కోరుకున్న ప్రేమ దక్కకనే లవ్‌లో విఫలం అవుతున్నా. ఇది నన్ను చాలా బాధిస్తుంది. నేనూ మనిషినే కదా. నాకూ ఎమోషన్స్, ఫీలింగ్స్ ఉంటాయి. నాకంటూ కొన్ని కోరికలు ఉంటాయి. వాటి విషయంలో నేను కాంప్రమైజ్ కాను' అని శ్రుతి హాసన్ తెలిపింది. శ్రుతి హాసన్ ఇంకా మట్లాడుతూ.. నేను గతంలో కొందరితో ప్రేమలో పడ్డాను. ఆ సమయంలో వాళ్ళు నన్ను చాలా బాగా చూశారు. వారితో నా లవ్ జర్నీ బాగానే సాగింది. కానీ, కొన్నాళ్ళకు బోర్ గా అనిపిస్తోంది. అందుకే వారికి నేను దూరంగా జరిగాను. ఆ విషయంలో నా మాజీ బాయ్‌ఫ్రెండ్‌లను నేను ఎప్పటికీ విమర్శించను' అని శ్రుతి హాసన్ తెలిపింది.



## అక్షయ తృతీయకు ముందు భారీగా తగ్గిన బంగారం ధరలు

అక్షయ తృతీయకు ముందు బంగారం ధరల్లో డౌన్ ట్రెండ్ కొనసాగుతోంది.. గత నెల రోజులుగా ఉక్కిరి బిక్కిరి చేస్తున్న బంగారం ధరలు కాస్త ఊరటను ఇచ్చాయి. లక్షను టచ్ చేసి దాటిపోయిన బంగారం ధర గత రెండు రోజులుగా తగ్గుముఖం పడుతుంది. నేడు మరింతగా తగ్గి పసిడి ప్రియులకి భారీ ఊరట కలిగించింది. సోమవారం బంగారం ధరలు భారీగా తగ్గాయి.. ఆల్‌టైమ్ హై లక్ష నుంచి నుంచి దాదాపు రూ.3,500 వరకు బంగారం ధర తగ్గింది. తాజాగా.. పది గ్రాముల బంగారంపై రూ.700 మేర ధర తగ్గింది. దేశియంగా 22 గ్రాముల బంగారం ధర రూ.89,400 లు ఉండగా.. 24 క్యారెట్ల బంగారం ధర రూ.97530గా ఉంది. 22 క్యారెట్లపై రూ.620, 24 క్యారెట్లపై రూ.680 మేర ధర తగ్గింది.



## ఇరాన్‌లో పేలుళ్ల ఘటన.. 40కి చేరిన మృతుల సంఖ్య

ఇరాన్‌లోని అత్యాధునిక షాహిద్ రజాయి నౌకాశ్రయంలో శనివారం భారీ పేలుళ్లు సంభవించిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ ఘటనలో 40 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 1,000 మందికిపైగా గాయపడ్డారు. వారిలో 197 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు హోర్మోజ్గాన్ గవర్నర్ మొహమ్మద్ అషారి తజియాని ఊటంకిస్తూ స్థానిక మీడియా నివేదించింది. ఈ ఘటనకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని జిన్హువా వార్తా సంస్థ పేర్కొంది. ఇరాన్‌లోని అత్యాధునిక షాహిద్ రజాయి నౌకాశ్రయంలో శనివారం ఈ ఘటన చోటు చేసుకుంది. పేలుడు ధాటికి సమీపంలోని భవనాల అద్దాలు ధ్వంసం అయ్యాయి. ఒక భవనం నేలకూలింది. దట్టమైన నల్లటి పొగ వ్యాపించింది. పేలుడు నేపథ్యంలో ఘటనాస్థలానికి సమీపంలో ఉన్న పాఠశాలలు, కార్యాలయాలను తాత్కాలికంగా మూసివేశారు. పోర్టులో నిల్వ ఉన్న కొన్ని కంటెయినర్లు పేలడంతో ప్రమాదం జరిగిందని స్థానిక విపత్తు నిర్వహణ అధికారి మెహర్దాద్ హసన్జాదే చెప్పారు. పేలుడులో పెద్దఎత్తున చెలరేగిన మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




## ఇండో-నేపాల్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో డేవిడ్ తైక్వాండో అకాడమీ విజయఝుండా

హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడలో ఉన్న విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండో-నేపాల్ ఇంటర్నేషనల్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో డేవిడ్ తైక్వాండో అకాడమీ అనేక మెడల్స్‌ను గెలుచుకుని ప్రతిభను చాటింది. పోటీల్లో భాగంగా అకాడమీకి చెందిన క్రీడాకారులు విభిన్న విభాగాలలో మెరిశారు.
బ్రాంజ్ మెడల్స్ విజేతలు: అదివా హుస్సైన్, ఆరవ్, ధృవంశ్, ఆయుష్మాన్, స్వరాజ్, కౌశిక్, అభిరథ్
సిల్వర్ మెడల్స్ విజేతలు: దేవాంశ్, దరహాస్
గోల్డ్ మెడల్స్ విజేతలు: నిక్షిత్, తౌఫీక్, ఈషా, సిద్ధార్థ్, తన్వి
ఈ విజయానికి మార్గదర్శకుడిగా నిలిచిన అకాడమీ చీఫ్ కోచ్ డేవిడ్ను క్రీడాకారులు మరియు తల్లిదండ్రులు అభినందించారు. ఆయన శ్రమ, ప్రోత్సాహం వల్ల విద్యార్థులు ఈ స్థాయికి ఎదగగలిగారని ప్రశంసలు కురిపించారు.
ఈ సందర్భంగా, బ్రాంజ్ మెడల్ విజేత అయిన అదివా హుస్సైన్ తండ్రి నదీమ్ మాట్లాడుతూ, "డేవిడ్ సార్ యొక్క శిక్షణ వల్లే మా పిల్లలు మంచి ప్రదర్శన చూపగలిగారు. భవిష్యత్తులో ఇంకా గొప్ప విజయాలు సాధించాలని కోరుకుంటున్నాం," అని తెలిపారు.

## రకుల్ గ్లామరస్ ఫోజులు

ముద్దుగుమ్మ 'రకుల్ ప్రీత్ సింగ్' గ్లామరస్ ఫోజులు ప్రస్తుతం కుర్రకారుకు మత్తెక్కిస్తున్నాయి. ఈ పిక్స్ తో రకుల్ ప్రీత్ సింగ్ మళ్లీ సోషల్ మీడియాలో ఫుల్ క్రేజ్ సొంతం చేసుకుంది. పైగా అభిమానులతో నిత్యం టచ్ లోనే ఉంటుంది. కుర్రాళ్ల హృదయాల్లో కల్లోలం సృష్టించేందుకు ఎప్పటికప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ తనదైన శైలిలో కసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలో రకుల్ ప్రీత్ సింగ్ ఇన్స్టాగ్రామ్ లో పోస్ట్ చేసిన హాట్ పిక్స్ ప్రస్తుతం యువతకు మంచి కిక్కిచ్చేలా ఉన్నాయి. రకుల్ డిఫరెంట్ స్టైల్లో చీర కట్టి, అందమైన జ్యువెల్లరీ ధరించి తన అందాలతో కుర్రకారును మాయ చేస్తుంది. ప్రస్తుం దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట్లో తెగ వైరల్ అవుతున్నాయి. హాట్ డ్రెస్ లో బోల్డ్ బాంబ్ లా క్లీవేజ్ పరువాలతో రకుల్ విస్ఫోటనం సృష్టించింది. చూపులు తిప్పకోలేని విధంగా ఎలాంటి గ్లామర్ హద్దులు లేకుండా రకుల్ ప్రీత్ సింగ్ ఈ ఫొటోల్లో చెలరేగిపోయింది. మొత్తమ్మీద రకుల్ ప్రీత్ సింగ్ అందాలకు కుర్రాళ్లు ఫిదా అవుతున్నారు.






## 'శుభం'ట్రైలర్ రిలీజ్

స్టార్ హీరోయిన్ సమంత యొక్క ప్రొడక్షన్ హౌస్ ట్రలాలా మూవింగ్ పిక్చర్స్ రాబోయే యూత్ ఎంటర్టైనర్ 'శుభం' ని నిర్మిస్తుంది. ఈ చిత్రంతో నటి నిర్మాతగా వస్తున్నారు. థ్రిల్లింగ్ మరియు వినోదాత్మక టీజర్‌తో ఆకట్టుకుంది. ఈ కామెడీ హర్రర్ చిత్రం ఉత్కంఠభరితమైన నవ్వు అల్లర్లను అందిస్తుందని హామీ ఇచ్చింది. ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్ ఆన్‌లైన్‌లో విడుదల చేయబడింది. భర్తలు తమ భార్యలను ఎలా నియంత్రిస్తారో చర్చించడంతో ట్రైలర్ స్టార్ట్ అవుతుంది. అకస్మాత్తుగా ఇది కొత్తగా వివాహం చేసుకున్న జంట యొక్క మొదటి రాత్రి సెటప్‌లో ఉంటుంది. అక్కడ వరుడు మొదట్లో మృదువుగా మాట్లాడేవాడు ఆల్ఫా మగవాడిగా తనను తాను నొక్కిచెప్పడానికి ప్రయత్నిస్తాడు. ఇంతలో వధువు నిశ్శబ్దంగా మరియు రిజర్వ్ చేయబడినట్లు కనిపిస్తుంది. వారి పెళ్లి రాత్రి అతని మాట వింటుంది. ఏదేమైనా, ఆమె ఒక టీవీ సీరియల్‌లో మునిగిపోయినప్పుడు విషయాలు వికారమైన మలుపు తీసుకుంటాయి.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం: పవన్ కళ్యాణ్

ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. శ్రీకాకుళంలో 'మత్స్యకారుల భరోసా' పథకానికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. దీనిపై పవన్ కళ్యాణ్ ఆనందం వ్యక్తం చేశారు. 'మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. మత్స్యకారుల వలసలు తగ్గించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. సముద్రంలో చేపలు వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రెట్టింపు చేస్తాం.' అని పవన్ అన్నారు. రాష్ట్రంలో మత్స్యకారుల వలసలు తగ్గించే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని, సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రెట్టింపు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గౌ|| ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ. 10,000 నుంచి రూ.20,000 పెంచాము. మత్స్యకారుల సేవ పథకం ద్వారా ఈ మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్నాము. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,29,178 మత్స్యకార కుటుంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరుతోంది. చేపల వేటపై ఆధారపడ్డ కష్ట జీవులకి ఈ రెండు నెలలు జీవనానికి ఎలాంటి సమస్య రాకుండా చేసే దిశగా ఎన్నికల మేనిఫెస్టో రూపకల్పన దశలోనే చర్చించడం జరిగింది.





## ముస్తాబవుతున్న కేదార్‌నాథ్ ఆలయం

చార్‌ధామ్ యాత్రలో భాగంగా జ్యోతిర్లింగ క్షేత్రమైన కేదార్‌నాథ్ ఆలయాన్ని మే2వ తేదీన ఓపెన్ చేయనున్నారు. ఈ విషయాన్ని బద్రీనాథ్ – కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య వచ్చే నెల 2వ తేదీన ఉదయం ఆలయ తలుపులు తెరవనున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. పరమేశ్వరుడి పవిత్ర ఆలయాలైన 12 జ్యోతిర్లింగాల్లో కేదార్‌నాథ్ ఆలయం ఒకటి. చార్‌ధామ్ యాత్రలో కేదార్ నాథ్ దేవాలయం సందర్శన భాగంగా ఉంటుంది. ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల మంది భక్తులు కేదార్‌నాథ్‌కు చేరుకుని పరమేశ్వరుడ్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అయితే ఏటా శీతాకాలం ప్రారంభం కాగానే ఈ ఆలయాన్ని మూసివేస్తారు. శీతాకాలంలో దాదాపు ఆరు నెలల పాటు ఈ ఆలయ తలుపులు మూసే ఉంటాయి. ఆ సమయంలో ఆలయం మొత్తం మంచుతో కప్పకుపోయి ఉంటుంది.

### కేంద్రం నిధులు తెలంగాణ అభివృద్ధిపై


## కేసీఆర్ చెప్పేవన్నీ అబద్ధాలని విమర్శలు

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజా సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బీఆర్ఎస్ రజతోత్సవాల సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలపై కేసీఆర్ చేసిన విమర్శలను రాజా సింగ్ తప్పుబట్టారు. కేసీఆర్ చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన కొట్టిపారేశారు.గతంలో ప్రధాని నరేంద్ర మోదీని దేవుడంటూ ఆకాశానికెత్తిన కేసీఆర్, ఇప్పుడు నిధుల విషయంలో విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని రాజా సింగ్ అన్నారు. "అప్పుడు మోదీ దేవుడు మరి నిధులు ఎందుకు అడగలేదు భయపడ్డారా అంటూ ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీలో తాను నిధుల గురించి ప్రశ్నించినప్పుడు కూడా కేసీఆర్ తప్పుడు సమాధానాలు ఇచ్చారని రాజా సింగ్ గుర్తుచేశారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి పది లక్షల కోట్ల రూపాయల నిధులు అందించిందని రాజా సింగ్ స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం అందించిన చేయూతే కారణమని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం పూర్తిగా అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, 'అప్పుల తెలంగాణ'గా, 'మత్తు తెలంగాణ'గా మార్చారని తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్రంలో యువత పెద్ద ఎత్తున మద్యానికి బానిసలు కావడానికి కేసీఆర్ ప్రభుత్వ విధానాలే కారణమని ఆయన దుయ్యబట్టారు.ప్రజలు కూడా కేసీఆర్ పాలనను చూశారని, డబుల్ ఇంజన్ సర్కార్ కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తేనే తెలంగాణ నిజమైన అభివృద్ధి సాధిస్తుందని విశ్వసిస్తున్నారని రాజా సింగ్ అభిప్రాయపడ్డారు. అయితే, గత ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాకపోవడానికి తమ పార్టీలోని కొందరు నేతల వైఖరే కారణమని పరోక్షంగా వ్యాఖ్యానించారు. త్వరలోనే పార్టీకి కొత్త అధ్యక్షుడు వస్తారని, ఆయన నాయకత్వంలో ప్రజల్లోకి బలంగా వెళతామని ధీమా వ్యక్తం చేశారు.ఇకపై బీఆర్ఎస్ అధికారంలోకి రావడం అనేది కేసీఆర్ మరిచిపోవాలని రాజా సింగ్ అన్నారు. "మీ ప్రభుత్వం మళ్లీ వస్తుందనే భ్రమ వీడండి. మీరు ఫార్మ్ హౌస్‌కు వెళ్లి విశ్రాంతి తీసుకోండి" అంటూ కేసీఆర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు.



## శ్రీవారి భక్తులకు గుడ్ న్యూస్ చెప్పిన టీటీడీ

తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. వీకెండ్‌తో పాటుగా వేసవి సెలవులు కూడా కావటంతో తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. దీంతో తిరుమల కొండపై భక్తుల తాకిడి పెరిగింది. అలాగే సర్వదర్శనం టోకెన్ల కోసం వచ్చే భక్తులతో శ్రీవారిమెట్టు మార్గంలోనూ రద్దీ నెలకొంటోంది. సర్వదర్శనం టోకెన్ల కోసం శ్రీవారిమెట్టు వద్ద భక్తులు క్యూలైన్లలో బారులు తీరుతున్నారు. అలాగే అలిపిరి చెక్ పోస్టు వద్ద కొండపైకి వెళ్లే వాహనాలు బారులు తీరుతున్నాయి. ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనానికి 18 గంటల వరకూ సమయం పడుతోంది. మరోవైపు వేసవి రద్దీ నేపథ్యంలో తిరుమలలో వీఐపీ, సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనాలను రద్దు చేశారనే వార్తలు వచ్చాయి. మే, జూన్ నెలల్లో తిరుమలలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉందని.. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని భక్తులు ఇబ్బందులు పడకూడడనే ఉద్దేశంతోనే ఈ రెండు నెలలు వీఐపీ దర్శనాలతో పాటుగా సిఫార్సు లేఖలపై శ్రీవారి సేవలు, బ్రేక్ దర్శనాలు, సుప్రభాతం దర్శనాలు రద్దు చేశారంటూ వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వీటిపై క్లారిటీ ఇచ్చారు. ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలతో శ్రీవారి దర్శనానికి అనుమతి యథాతథంగా ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు బోర్డు సభ్యులు ఇచ్చే సిఫార్సు లేఖలతో శ్రీవారి దర్శనం ఉంటుందని స్పష్టం చేశారు. మే, జూన్ నెలలలో శ్రీవారి దర్శనానికి గానూ ముందుగా సిఫార్సు లేఖలు తీసుకున్న భక్తులకు దర్శనాలు యథాతథంగా ఉంటాయని జ్యోతుల నెహ్రూ క్లారిటీ ఇచ్చారు. మరోవైపు జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటన నేపథ్యంలో తిరుమలలో అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ బృందాలు తిరుమలలో తనిఖీలు చేపట్టాయి. శనివారం రోజున జీఎన్‌సీ టోల్‌గేట్, అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గం ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. వాహనాలు, భక్తుల లగేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. మేదరమిట్ట, రాంభగీచా గెస్ట్ హౌస్, పార్కింగ్ ప్రదేశాల్లో బాంబ్ స్క్వాడ్ ద్వారా సోదాలు నిర్వహించారు. పహల్గాం ఉగ్రదాడిలో ముష్కర మూకలు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది వరకూ చనిపోయారు.



## పాతబస్తీలో ఈడీ సోదాలు

హైదరాబాద్ పాతబస్తీలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. భూదాన్ భూముల వ్యవహారంలో పాతబస్తీకి చెందిన ప్రముఖ వ్యాపారి షర్ఫోన్‌తోపాటు మున్వర్‌ఖాన్, ఖదీర్ ఉన్నీస్ నివాసాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. మహేశ్వరంలో వంద ఎకరాల భూమిని కబ్జా చేశారని వీరిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారి ఇండ్లతోపాటు కార్యాలయాల్లో దాడులు నిర్వహించారు. ఇదే వ్యవహారంలో ఇప్పటికే మాజీ ఐఏఎస్ అమోయ్ కుమార్‌ను ఈడీ విచారించిన విషయం తెలిసిందే. కాగా, హైదరాబాద్‌లో షర్ఫోన్ ప్రముఖ వ్యాపారిగా కొనసాగుతున్నారు. ఆయనకు నగరంలో పలుచోట్ల భారీ షోరూమ్‌లు ఉన్నాయి. ఐఏఎస్ అమోయ్‌కుమార్ రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్ రెవెన్యూ పరిధిలోని 17వ సర్వే నంబర్‌లో 386 ఎకరాల ప్రభుత్వ భూమిలో కొంత అన్యాక్రాంతమైనట్టు ఆరోపణలు వచ్చాయి. ఇదే సర్వేనంబర్‌లోని ప్రైవేట్ భూమి 26 ఎకరాల్లో మెరుగు గోపాల్ యాదవ్ వెంచర్ వేసి సీలింగ్ ల్యాండ్‌ను కూడా కలుపుకున్నాడు. అయితే తమ భూమిలో గోపాల్ యాదవ్ వెంచర్ వేశాడని పలువురు రైతులు ఆరోపిస్తూ అప్పటి కలెక్టర్ అమోయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నామని, తమ పేరిట పట్టాలు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లినా ఆయన పట్టించుకోలేదు. దీనిపై మీడియాలో కథనాలు రావడంతో ఈ వ్యవహారంపై నిగ్గుతేల్చేందుకు ఈడీ రంగంలోకి దిగింది.



## ఇన్‌స్టాలో ఎర.. రూ.25 లక్షలకు వల

కర్ణటకలో గజేంద్రగఢ నివాసి రాఘవేంద్ర రాథోడ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువతి వలలో పడి రూ.25 లక్షలు పోగొట్టుకున్నాడు. ఆ యువతి ప్రేమించాను, పెళ్లి చేసుకుంటానని ఎరవేసి అతనితో కొన్ని రోజులు చాటింగ్ చేసి, తర్వాత నగదు తీసుకుని మోసం చేసింది. దీంతో రాఘవేంద్ర ఆత్మహత్యకు ప్రయత్నించాడు. నిందితురాలు రోణ ఠాణా ఇన్‌స్పెక్టర్ సిద్ధప్ప బీళగికి బంధువని బాధితుడు తెలిపాడు. దీనిపై గదగ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు.

## టీటీడీ ట్రస్టుకు భారీ విరాళం

టీటీడీ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు ఆదివారం రూ.2 కోట్లు విరాళంగా అందింది. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద ప్రకటించిన రూ.1.50 కోట్ల చెక్‌ను ఆ సంస్థ జోనల్ హెడ్ ధారాసింగ్ నాయక్, రీజనల్ హెడ్ వెంకటేశ్వర్లు తిరుమలలో అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. అలాగే చెన్నైకి చెందిన పాన్‌ప్యూర్ కెమికల్ ఇండియా ప్రైవేట్ లిమిడెట్ సంస్థ సీఎండీ పొన్నుస్వామి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సూర్యప్రకాశ రూ.50 లక్షల చెక్‌ను అదనపు ఈవోకు అందజేశారు.



## మోదీ సభా వేదికపై 20 మందికి మాత్రమే అనుమతి

మే 2న ప్రధాని మోదీ ఏపీలో పర్యటించనున్నారు. అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవంతో పాటు రాజధానిలో పలు అభివృద్ధి పనులకు మోదీ శంకుస్థాపన చేయనున్నారు. సభకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే మోదీ సభలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో సహా 20 మంది ప్రముఖులకు మాత్రమే వేదికపై పాల్గొననున్నారని సమాచారం. భద్రతా కారణాల వల్ల ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిసింది.